# జీవిత పరమార్థం

తను రచయిత కావాలనుకున్నాడు శివం. రచయితగా చాలా మేలు సాధించవచ్చుననుకున్నాడు శివం. ఇంత తొందర్లో మృత్యువు తనను వెంటాడుతుందని అతడు ఊహించలేకపోయాడు.

భూమ్యాకాశాలను ఆవరించింది చీకటి. మృత్యువు విశ్వరూపంలా ఉంది చీకటి. స్వర్గంలోని దేవతల్లా వెలుగుతున్నాయి ఆకాశంలోని నక్షత్రాలు.

తన గదిలో బుడ్డిదీపం వెలుతురు అవసానదశలో ఉన్న రోగి ప్రాణంలా మిణుకు మిణుకుమంటూ వెలుగుతున్నది. గోడమీది బల్లి ప్రక్కనే ఉన్న పురుగు కోసం ఆఖరిగంతు వెయ్యటానికి సిద్ధంగా ఉంది. పగబట్టిన కౄరజంతువులాగ గుండెనొప్పి రాక్షసంగా ప్రాణాన్ని చీల్చేస్తున్నది.

చావు తప్పదు.

పొరుగుఇంటిలో సీతారాం ఉన్నాడు. పెళ్లిచేసికొని కొత్తగా వారందినాల కిందటే భార్యను తీసుకువచ్చి కాపురం పెట్టాడు. లేచి సీతారాం వచ్చి తనని చూస్తే బావుండును. డాక్టర్‌ని పిలుచుకుని వచ్చేవాడు. కాని సీతారాం ఈ అర్ధరాత్రి నిద్రలో ఉంటాడు. సీతారాంకి ఎట్లా తెలుస్తుంది? దిక్కుమాలిన బతుకయిపోయింది. కదా.

ఎవరూ లేరు కదా. ఒంటరి బతుకు...

బలవంతుడయిన శత్రువు పగలాగ హింసిస్తున్నది గుండెనొప్పి. రాళ్లమధ్య నలిగిపోతున్నట్టుంది. ఊపిరిసైతం పీల్చుకోలేకపోతున్నాడు.

భయంగా ఉంది. చచ్చిపోతున్నాడు. కొద్ది నిముషాల్లో ఈ వెలుగు కన్పించదు. ఆ బల్లి ఎగిరిగంతు వేసి పురుగును మింగేస్తుంది.

అమ్మా అమ్మా అని మూలుగులు.

కూర్చోలేకపోతున్నాడు. పడుకోలేకపోతున్నాడు. నుంచోలేకపోతున్నాడు. నొప్పి తగ్గటం లేదు. భగవంతుడు ప్రత్యక్షమై ఈ భాధని తీసేయ రాదా? ఈశ్వరా ఈశ్వరా... రామా రామా... కృష్ణా కృష్ణా...

తిరుపతి వెంకటేశ్వరా — దీన బాంధవుడివి... విను. నా మొర ఆలించు... నన్ను బతికించు స్వామీ... నా కెందుకీ నరకశిక్ష విధించావు స్వామీ? ఏం తప్పు, ఎప్పుడు, ఎవరికి చేశానని! చేసే ఉంటాను. లేకపోతే నాకెందుకీ బాధలు, దుఃఖాలు, ఆపదలు. నేను ఘోరపాపాత్ముడినే. కాకుంటే బాల్యంలోనే తల్లితండ్రులు, ఇన్నాళ్లూ పెంచి పెద్దచేసిన అక్క లేకుండా పోతారా! కట్టుకున్న భార్య మూన్నాళ్ల మామూలు జ్వరానికే చచ్చిపోతుందా? నేను గతజన్మలో చేసిన పాపాలకు శిక్ష ఈ జన్మలో అనుభవిస్తున్నాను. నేను పాపాత్ముణ్ణే.

కొండ చిలువ మింగేస్తున్నట్టు నొప్పి.

'అమ్మా'

సిలువను వేస్తున్నంత బాధ. ప్రాణాలు త్వరగా పోతే బావుండును. త్వరగా. ఈ శరీరాన్ని వదిలేస్తే చాలు. భరించలేను ప్రభూ. భరించలేను ఈ బాధ. ప్రభూ! నన్ను తీసుకుపో... ఈ లోకం నించి నన్ను తీసుకుపో... ఈ హింసవద్దు. ఈ బాధ వద్దు. నాకు బతుకు వద్దు.

తల గోడకేసి కొట్టుకున్నాడు. ఒకటి — రెండు — మూడు —

బాధ తగ్గదు. గుండెనొప్పి తగ్గదు. మృత్యువు రాదు.

మిత్రుడు రావు గుర్తుకు వచ్చాడు. అతడికి ఉత్తరం రాయాలి. తన కథను ప్రచురిస్తున్నట్టు పత్రిక తెలియపరచింది. తన బాల్యమిత్రుడు గురయిన విషమ పరిస్థితి ప్రేరణగా ఆ కథ రాశాడు. రావుకు రాయాలి. నేను 'పరలోకప్రాప్తి' చెందితే ఆ సంగతి వెంటనే పత్రికకు తెలియపరచమని. ఇంతవరకు ప్రచురితమైన నాలుగు కథలు ఓ సంకలనంగా తీసుకురావాలి. ఆ సంకలాన్ని నన్ను చిన్న నాటి నుండి తన ఒడిలో లాలించిన కన్నతల్లి నాగావళి నదీమాతకు అంకితం అని రాయండి. నా

నవల 'నవ ఝురి' సగంలోనే ఆగిపోయింది. ఇది అసంపూర్ణంగానే ఉండిపోతుంది. అయినా అచ్చు వేయవచ్చు. దాంట్లో తెలుగు సాహిత్యానికి కొత్త జీవితాలనీ, కొత్త ఆచార వ్యవహారాలనీ, కొత్త విలువలనీ పరిచయం చేస్తున్న ప్రయత్నం పాఠకులు తెలుసుకుంటారు. సాహిత్యం మీది ప్రేమతో పరిచయం చేసుకున్న రచయిత మిత్రులు తనకు రాసిన ఉత్తరాలు చాలా ఉన్నాయి. వాటిలో చాలామందికి ముఖ్యంగా — సాహిత్యాభిమానులకు — ఆసక్తి కలిగించేవి ఉన్నాయి. అవి కూడా అచ్చువేయించ గలిగితే — పత్రికలు తిప్పి పంపిన కథలు ఓ అరడజను వరకు ట్రంకు పెట్టెలో దాచుకున్నాను. అవి పనికొచ్చేట్టు అన్పిస్తే ఉంచండి లేకపోతే చించేయండి. కాని ఆ కథలంటే నాకు ఇష్టం. అవన్నీ నా తొలి కథలు కదా.

నండూరి యెంకి పాటలను ఆర్ట్ పేపర్ మీద రాసుకున్నాను. అవి ఒక పుస్తకంగా బైండ్ చేయించి గాంధీ మెమోరియల్ లైబ్రరీకి బహూకరించండి.

రిపబ్లిక్‌డేనాడు మనం సముద్రం ఒడ్డున కూర్చొని ఒక ప్రచురణసంస్థను ఏర్పాటుచేయటం అవసరం అనుకున్నాం. ఆ ప్రచురణసంస్థను గురజాడ పేరున పెట్టాలనుకున్నాం. రచయితలకు ఒక స్వంత ప్రచురణ సంస్థ అవసరం కదా. ఈ ప్రయత్నంలో మన మిత్రులంతా సహాయపడతారు. నేను చనిపోయిన తర్వాత ఉద్యోగరీత్యా కొంతపైకం వస్తుంది నాకు. నా బ్యాంక్ అకౌంట్‌లో కొంతపైకం ఉంది. ఆ మొత్తం ఈ ప్రచురణసంస్థకు ఉపయోగపడుతుందేమో ఆలోచించండి.

ఇంకా బల్లి చివరిగంతు వెయ్యలేదు. పొంచి చూస్తున్నది. అమాయకమైన పురుగు దీపం దగ్గర గోడమీద గంతులేస్తున్నది.

నెలదినాల క్రితం శివం వారం దినాలు పాటు సముద్రం ఒడ్డున జాలర్ల పేటలో వాళ్లతో పాటు ఉన్నాడు. వాళ్ల ఆచారవ్యవహారాలు, జీవితం అతడికి ఆశ్చర్యం కలిగించింది. వాళ్ల జీవితాలు ఇతివృత్తంగా రాసుకోవటానికి చాలా సమాచారం సేకరించాడు. హెమింగ్వే నవల 'ఓల్డ్ మేన్ అండ్ ది సీ' చదివాకా అలాంటి నవల ఒకటి రాయవచ్చుననిపించింది. చివరికి వాళ్లతోపాటు వాళ్ల పడవల్లో సముద్రంలోకి వెళ్లాడు. ఆ జాలర్ల చేపల వేట, ఒడ్డుకు చేరిన పడవల నుండి వలలనుండి చేపలను వాళ్లు పంచుకోవడం, సారాదుకాణాలకి వెళ్లి తాగటం, ఇళ్లల్లో తగువులు, భజనమందిరం దగ్గర పాటలు పాడుకోవటం, వాళ్ల ఆడవాళ్లనృత్యాలు, తనతోనే ముగుస్తాయి. ఆ నవల రాయటానికైనా బతికితే...

ఊపిరి పీల్చుకోలేకపోతున్నాడు. ప్రపంచమంతటా అపారంగా భగవంతుడు ప్రసాదించిన గాలిని లోపలికి పీల్చుకోలేకపోతున్నాడు.

శివం కళ్ల ముందు భార్యరూపం కనిపించసాగింది. భార్య కాపురానికి వచ్చి సంవత్సరం కూడా నిండకముందే ఆమె అదృశ్యమైపోతుందని అతడు అనుకోలేదు. అప్పుడే అన్పించింది తను కూడా చనిపోవాలని. అప్పుడే బతుకుమీద వైరాగ్యం కలిగింది. అప్పుడే బతుకంటే భయం కలిగింది. అప్పుడే బతుకంటే క్షణికం అన్పించింది. ఆమె పిల్లలని కంటుందనీ, వాళ్లు నాన్నా అని పిలుస్తారని, వాళ్లతో ఆడుకోవచ్చుని, వాళ్లని పెంచి పెద్దచేసి మంచి చదువులు చదివించి సంస్కారపరులని చేసి, ఉన్నతమైన ఆశయాలకి అంకితం చేసుకునే సదాశయపరులను చెయ్యాలని కలలు కన్నాడు. ఆ కలలన్నీ కల్లలయి పోయాయి.

రావుకి ఉత్తరం రాయాలి. కలం చొక్కా జేబులో ఉంది. చొక్కా హేంగర్‌కి వేలాడుతున్నది. నుంచుని కలం తీసుకోవాలి. కాని నుంచోలేక పోతున్నాడు. ఇంకేం ఉత్తరం. రేపు ఉదయం ఈ కట్టె... అన్నిటిని మట్టిలో కలిపేస్తుంది.

సీతారామ్ లేచి తన మూల్గులు విని రాకూడదా? సీతారామ్ వస్తే డాక్టర్‌ని పిలుచుకు వస్తాడు. కాని అతడి మూల్గులు ఆ గది నాలుగ్గోడల మధ్యే అణగారి పోతున్నాయి. బైటికి, సీతారామ్‌కి విన్పిస్తాయా? కలం తియ్యాలని నుంచుని లేవబోయి కింద పడిపోయాడు. కాళ్లూ చేతులు నేలమీద కొట్టుకో సాగాయి. ఇదే చివరి శ్వాస...

అలమరా కన్పించింది. దాన్నిండా పుస్తకాలు. తన ఆస్తి ఆ పుస్తకాలే.

ఆ పుస్తకాల్లోని ఆ జీవితాలు, కథలు, ఆ పాత్రలు, వాటి రూపురేఖలు, ఆ సాహితీ సౌందర్యాలు, ఆ భావజాలం, ఆ గ్రంథాలు తన కిచ్చిన ఆత్మబలం, ఆ పుస్తకాలన్నీ ఏమయిపోతాయి. లైబ్రరీకి వాటిని కూడా ఇచ్చేయమని రావుకు రాసేయాలి.

ఆ పుస్తకాలు తన జీవితం మీద ప్రేమల పూలవర్షం కురిపించాయి.

లేదు. ఇదే చివరి క్షణం.

మృత్యువు అంటే భయం పోయింది. ఇప్పుడు భయంలేదు. ఇప్పుడు మృత్యువుకు స్వాగతం...

గుండెనొప్పి. ఆంబోతు తొక్కుతున్నట్టు...

తన పన్నెండో ఏట... ఒక రోజు... హైస్కూల్ పార్లల్‌బార్ మీద వ్యాయామం చేస్తున్నాడు. పైన దండీలు తీస్తుండగా చేతులు పట్టుజారిపోయి సుమారు నాలుగున్నర అడుగులు ఎత్తున్న బార్‌మీంచి నేలమీద కప్పలా పడ్డాడు. ఆ రోజు ఐదునిముషాలు పట్టింది. పాము నోటిలోని కప్పలాగ అరిచాడు. అది మొదలు

సంవత్సరానికీ, ఆర్నెల్లకీ ఈ నొప్పి వస్తూనే ఉంది. వైద్యం చాలా చేయించాడు. సుమారు వెయ్యిరూపాయలు అప్పట్లో అక్క ఖర్చు పెట్టింది. ఆ చిన్ననాడే సరయిన వైద్యం చేయించాల్సింది. అక్క ఆరోజు గుండె మీద నూనెరాసి తోమింది. అంతే. బావ కసురుకున్నాడు. వెధవబారూ, నువ్వూనూ అని.

శివానికి నిండుజీవితం బతికే అదృష్టం ఉందని ధైర్యంగా ఉండేది. అంచేత తాను చేయాలనుకున్న కార్యకలాపాలసంఖ్య పెరిగిపోతూ వచ్చింది. ఓ మంచినాటకం రాయాలని దాన్ని ఆంధ్రవిశ్వవిద్యాలయంలో సాంస్కృతి కోత్సవాల మూల కర్త కె.వీ. గోపాలస్వామి గారికి అంకితం ఇవ్వాలని, శరత్ బాబు నవల 'శ్రీకాంత్' లాంటి గొప్పనవల ఒకటి రాయాలని, దేశాలు తిరిగి రావాలని, దేశంలోని మహాపుణ్యక్షేత్రాలనుచూసి రావాలని, తన భార్య స్మృతిలో ఆనందానుభూతి మాధుర్యసంపన్నతి కోసం బ్రతకాలనీ ఎన్నెన్నో స్వప్నాలు...

భయంతో పరుగెత్తే ఏనుగుల మంద తనను తొక్కుకుంటూ పోతున్నట్టుగా గుండెనొప్పి...

ఓ మిత్రుడడిగాడు. 'శివం గారూ, మీ కథల్లో నాయకులు గుండెజబ్బుతో చనిపోతారు. ఉదాహరణకి, 'గతజలసేతుబంధనం'లో ఆ ధర్మారావు, 'అశ్రువు'లో పద్మనాభము, 'పవన నృత్యం'లో శారద, 'చీకటి చిక్కుల్లో' నీలవేణి గుండెనొప్పితోనే చనిపోతారు. గుండెనొప్పి తప్ప మరో వ్యాధి లేదా చనిపోవటానికి?' అని.

ఆ పాఠకమిత్రుడు ఎత్తిచూపే వరకు తనకా స్పృహ లేదు. తన స్వీయ జీవితం ప్రభావం తనకు తెలియకుండానే తన రచనల్లో పడి ఉంటుందని సమర్థించుకున్నాడు. వాస్తవ జీవితం ఆధారంగా రాసిన కథలవి. వాస్తవికత యధాతథంగా రాయాలని కొన్నాళ్లు అభ్యాసం చేశాను. నిజానికి ఆ కథలు నా సృజన కాదు. ఆ కథలు వాస్తవాలు. ముగింపులు మాత్రమే నావి. అవి నిజజీవితాలు సుమా. కల్పిత పాత్రలు కానే కావు. ఆ ధర్మారావు కొరాపుట్‌లో క్రిందటి సంక్రాంతినాడు చనిపోయాడు. కథల్లో వాస్తవికత కోసం నా ప్రయత్నాలన్నీ ఆ రచనల్లో కన్పిస్తాయి. అయితే గుండెనొప్పితో చనిపోరా మనుషులు?' అని తిరిగి ప్రశ్నవేశాడు.

'అని కాదు. కాని రచయిత రచనలో వైవిధ్యం చూపించాలి కదా' అని ఆ మిత్రుడు రచన ఎట్లా ఉంటే తనకు నచ్చుతుందో వర్ణించి చెప్పాడు.

మృత్యువు ఒకటి రెండు మూడు అని క్షణాలని, శేషజీవితాన్ని లెక్కపెడుతున్నది. తన ముందు భీతి జనకమైన విరాట్‌రూపం కోటినిలువుల ఎత్తున మృత్యువు నుంచున్నది. శివం అణువులా ఉన్నాడు ఆ విరాట్‌రూపం ముందు. ఆ పాదం

అణువు మీదికి కదులుతున్నది.

శివంకి మంటలపంజరంలోకి నెట్టినట్టుంది. దేహం మీదికి మంటల నాలుకలు పాకుతున్నట్టుంది. అంతలోనే మళ్లీ ధైర్యం — ఆశాభావం —

'నేను చావను. ఈ నొప్పి ఇంతకుముందు చాలాసార్లు వచ్చినదే. వచ్చిన ప్రతిసారీ మృత్యువుతో ముఖాముఖే. ప్రతిసారి చచ్చిపోతాననీ అనుకున్నాను. చచ్చిపోలేదు. నేను బ్రతికి సాధించాల్సింది చాలా ఉంది. నేను మృత్యువును ఓడిస్తాను. భద్రాచలం గోదావరి అడవుల్లో కోయల గురించీ, అస్సాం టీ తోటల్లోని తెలుగుకూలీల గురించీ, దేశ రక్షణ కోసం సైన్యంలో సిపాయిలుగా చేరిన నా స్నేహితులు రంగన్న, వీరయ్య, రామచంద్రయ్యల గురించీ, విశాఖపట్నం నౌకా నిర్మాణసంస్థలో కార్మికుడు రాఘవులు గురించీ — ఎన్ని కథలు విన్నాడు. రాజస్థాన్‌లో జైపూర్ సాంస్కృతికోత్సవాలు, బెనారస్‌లోని దశాశ్వమేధ్ ఘాట్‌లో గంగ ఒడ్డున పండాలు చేయించే కర్మకాండలు, త్రివేణీ సంగమమ్‌లో కుంభమేళాలో వేలాది దిగంబర నాగాల స్నానాలు, న్యూఢిల్లీ కన్నాట్ ప్లేస్ ఫుట్‌పాత్‌ల మీద రాజస్థానీ స్త్రీలు నకలుమినియేచర్ పెయింటింగ్‌లను విదేశీపర్యాటకులకు విక్రయించటం, తెలంగాణాలోని లంబాడా స్త్రీల ఆదివాసీ వేషాలంకరణలు — వాటి గురించి ఇంకా ఇంకా తెలుసుకుని, పరిశోధించి ఎంత గొప్ప కథలు రాయొచ్చో కదా. వాళ్ల మధ్య బతకాలి. అంతవరకు అవి సాహితీ బద్ధంచేసేవరకు, కథాస్వరూపాల్లో తీర్చిదిద్దేవరకు మృత్యువు తనను సమీపించదు. మృత్యువును తాను శాసించగలడు.

కీట్స్ మరి కొన్నేళ్లు బతికి ఉండకూడదా! అంత చిన్నవయసులో ఎట్లా రాయగలిగాడు అంత గొప్పకవిత్వం —

చీమను మనిషి కాలితో తొక్కి నేలరాసినట్టు ఉంది గుండెనొప్పి. ముడి బిగుసుకు పోయి ఊపిరాడటం లేదు. అంతటి యౌవనంకూడా గిలగిల తన్నుకుంటున్నది.

ఇది గుండెపోటుతో వచ్చిన నొప్పేనా? లేక ఇది గుండెకు తగిలిన దెబ్బవలన కలిగిన నొప్పా? ఇదివరలో చూసిన డాక్టర్లు ఎవరూ ఏమీ చెప్పలేదు. మందు మాత్రలూ, సూది మందులూ ఇచ్చేవారు. తగ్గిపోతుందనే వారు. ఈ ఆధునిక వైద్యం — పరీక్షలు చేసి తెలుసుకోగలిగిన అల్లోపతి వైద్యం రాక పూర్వం ఇట్లాంటి వ్యాధులకు ఔషధాలు ఉండేవా? అప్పుడు ఈ జబ్బులు ఉండేవా? క్షయ ఉండేది. ఉబ్బసం ఉండేది. రాచకురుపు ఉండేది. ఊపిరితిత్తులకూ, గుండెకూ సంబంధించిన

వ్యాధులేనా ఇవి? ఆ రోగులు ఇట్లాంటి నరకయాతననే భరిస్తారేమో. భగవంతుడే ఈ వ్యాధులకన్నిటికీ వైద్యుడేమో. అందుకేనేమో ఈ పూజలు. ఈ ప్రార్థనలు. ఈ దైవ దర్శనాలు. ఈ వ్రతాలు, ఉత్సవాలు.

భగవంతుడా! రక్షించు తండ్రీ! కాపాడు తండ్రీ! బతికించు తండ్రీ!

అంతలోనే శివంకి తన జీవితం మీద వైరాగ్యంకూడా కలుగుతున్నది. ఈ చిత్రహింస జీవితమంతా భరించే బదులు చావే మంచిది అనిపించసాగింది. ఎన్ని రకాల— రకరకాల చావులు. పాముకాటుతో... సముద్రంలో దూకి... బావిలో పడి... రైలు కింద పడి... పోట్లాటల్లో... శత్రుత్వాల్లో... పగాకార్పణ్యాలతో ...

ఈ ప్రపంచం అంతా మృత్యువే... అన్పిస్తున్నది.

శివం గుండెల్లోంచి... పెడబొబ్బ పెట్టాడు. పొరుగింటి సీతారామ్‌కి ఈ పెడబొబ్బ వినిపిస్తుందా? అమ్మా అమ్మా అన్న మూలుగులు అవి సీతారామ్‌కి విన్పిస్తాయా? కమలే తన ప్రక్కన ఉంటేనో ఎంత బాధపడేది! ఎంత బెంగ పెట్టుకునేది. డాక్టర్‌ని రప్పించేది. స్నేహితులని రప్పించేది. కమల కాపురానికి వచ్చిన తొలిరోజుల్లో ఈ నొప్పి వచ్చి గిలగిల తన్నుకుంటూఉంటే తనని చూస్తూ కళ్లనిండా నీళ్లు పెట్టుకుని ఏడ్చేసింది. భయపడి పోయింది. తన గుండెమీద నూనెరాసి తోమింది. వేడి ఆవిరితో కాపడం పెట్టింది.

వెంకటేశ్వరుని పటం దగ్గరకు వెళ్లి మొక్కులు మొక్కింది.

కమలలేని లోటు ఎవరు తీరుస్తారు? అమ్మలేనిలోటు ఎవరు తీరుస్తారు? కమల... అమ్మా... నాన్న.....

గుండెనొప్పికన్న తన నిస్సహాయత తనను ఆదుకోగల మనుషులు ఎవరూలేని నిస్సహాయత...

ఇట్లాంటి బాధ, దుఃఖము, నిస్సహాయత అందరికీ ఉంటుందేమో!

ఈ మనుషుల హృదయాలలో భగవంతుడు లేడా! ఇలాంటి మనుషుల్లో అందమెక్కడిది? ప్రేమ ఎక్కడిది?

శివంకి ప్రపంచంమీద, మనుషులమీద కోపం, అసహనం, ఆవేశం ఏర్పడ్డాయి. ఆ ఆవేశంలో తనని మరచిపోయాడు. లోకజ్ఞానాన్ని కోల్పోయాడు. విచక్షణా శూన్యుడయ్యాడు.

ఈ సారి ఈ నొప్పి తగ్గదు. రచయిత శివం, ఉన్నత ఆశయాల శివం, ఉత్తమ ఆదర్శాల ఉద్యోగి శివం, దివంగత కమల భర్త శివం భౌతిక దేహానికి ఇంక ఏ నొప్పీ ఉండదు.

కమల కనిపిస్తుందా స్వర్గంలో. తనను గుర్తుపట్టుందా?

తను పోయేది స్వర్గానికో నరకానికో... కాని కమలమాత్రం స్వర్గానికే పోయింది.

తను — పాపాలు చెయ్యలేదు. ఎవరికీ ద్రోహాలు చెయ్యలేదు. ఎవరికీ అన్యాయాలు చెయ్యలేదు. ఎవరినీ హింసించలేదు. తను పుట్టుకతో పిరికివాడు... తను అట్లాంటివి చెయ్యలేదు. కండ్లముందు ఏదన్నా గొడవ జరిగితే అక్కడినుండి పరుగు పరుగున పారిపోతాడే తప్ప... అక్కడ నిలబడలేదు.

తను పుణ్యాలూ, ధర్మాలూ, దానాలూ చెయ్యలేదు. తీర్థ యాత్రలు చెయ్యలేదు. పుణ్యనదుల్లో మునగలేదు. తల్లినాగావళితప్ప — ఏ మహానదులూ తను చూడలేదు... గంగా గోదావరుల్లో మునగలేదు...

స్వర్గనరకాల్లేవనీ, అంతరాత్మే యమధర్మరాజనీ గాఢంగా నమ్మిన శివంకి ఇప్పుడు ఆ నమ్మకం కూడా గుర్తులేదు. మరీ చిన్ననాడు అమ్మమ్మ, తాతయ్య చెప్పినకథలన్నీ... రాక్షసులు, భూతాలుకథలన్నీ ఇప్పుడు నిజమనిపిస్తున్నాయి. శివం పెరిగి పెద్దవాడయిన తర్వాత ఆ కథలన్నీ మరచిపోయాడు. శివం తాను ఎదిగాడు అనుకున్న లోకాలన్నీ ఎక్కడో నిశ్శేషంగా కూలిపోయాయి. అభ్యుదయ రచయిత శివం, ఆదర్శ వాది శివం, జిల్లాపరిషత్‌ఉద్యోగి శివం, ప్రపంచాన్ని ప్రేమించిన ప్రేమికుడు శివం, మానవ కుటుంబం మీద అనంత విశ్వాసమున్న ఆశావాది శివం—

బూడిదయి మట్టిలో కలిసిపోతాడు.

పురుగు దీపంచుట్టూ తిరిగి మళ్లీ గోడమీద బల్లికి అంతదూరంలో వాలింది. పురుగును దూరంనుండి చూసి చూసి బల్లి, పురుగు దగ్గరకు చేరింది. బల్లి తనవేపు వస్తున్నట్టు పురుగు ఎరుగునా? బల్లిరాక కన్పిస్తుందా? అక్కడినుండి తప్పించుకోదేం? బల్లి తన నాలుకను పురుగు మీదికి విసుర్తుందా?

శివంకి జాలేసింది. తన కండ్లముందే అంతా జరుగుతున్నది. గోడ పైభాగాన ఉంది. బల్లిని... రాకుండా తరిమేస్తే బావుండును. కాని లేచినుంచోలేదుకదా. దీపం ఆర్పేస్తే... ఆ ఆలోచన రావటంతోనే బుడ్డిదీపం వత్తిని దించేశాడు. దీపం ఆరిపోయింది. చీకటి.

***

సీతారామ్‌కి ఒళ్లంతా చెమటలు పోశాయి. పక్కమీద నిద్రపోలేకపోయాడు. కిటికీలు మూసేసి ఉండటంవల్ల గాలిబొత్తిగా లేదు. ఎండాకాలంలా ఉంది.

తలుపులు తెరచి బయట కొద్దిసేపు కూర్చోవాలనిపించింది. తలుపులు తెరుచుకుని బైటకి వచ్చాడు సీతారామ్. బయట దట్టమైనచీకటి. ఆకాశంలో నక్షత్రాలు తప్ప ప్రపంచం ఏమీ కన్పించటం లేదు. ఇరుగు పొరుగు ఇళ్లుసైతం కన్పించటం లేదు. ఊరు కన్పించడం లేదు. ఒక్క ఆకాశమే... మెరుస్తున్న ఆ నక్షత్రాలే...

బయట చల్లగా ఉంది. హాయిగా ఉంది. ప్రశాంతంగా ఉంది. భార్యకూడా తనతో పాటే బైటికి వస్తే సంతోషిస్తుందనిపించింది. ఈ నక్షత్రాలను చూసి మురిసిపోతుందనిపించింది. వశం తప్పినట్టుగా ఉన్న శరీరం ఆనంద తరంగాలలో తేలిపోయి ఆడుతున్నట్టుంది. తన శరీరంలో రక్త నాళాల్లో ప్రేమామృతం ప్రవహిస్తున్నట్టుంది. మనసునిండా, హృదయం నిండా తన ప్రియురాలు శరీరపరిమళం వ్యాపించినట్టు ఉంది. ప్రియురాలి దీర్ఘాన్వేషణానంతరం పిలిచిన పిలుపులాగ కార్తీకపవనం శరీరాన్ని స్పర్శిస్తున్నది. శరీరం మొత్తం చల్లబడేవరకు వీధి అరుగుమీద గాలిలో కూర్చున్నాడు సీతారామ్. శరీరం చల్లబడి తన స్వాధీనమైన తర్వాత మరోసారి భార్య గుర్తువచ్చింది. లోపలికి వెళ్లబోతుండగా పొరుగింటి నుండి ఒక పెడబొబ్బ వినిపించినట్టయింది...

వెళ్లి శివంని చూడాలనిపించింది సీతారామ్‌కి. కాని అదే సమయంలో ఎన్నో గొంతుకలతో భార్య చేతుల్లోని గాజులు గలగలా పిలిచాయి. పొరుగింట్లో శివం పెడబొబ్బ విన్నట్టు భార్యతో చెప్పాలనుకుని సీతారామ్ ఇంట్లోకి వెళ్లాడు. వెతుక్కుంటూ చీకట్లో మంచం దగ్గరకు వెళ్లాడు. అతడు మంచం మీద కూర్చున్నాడు. ఆమె భర్తచెయ్యిని గట్టిగా బలంగా పట్టుకుని దగ్గరగా లాక్కుంది. ఆమె కురుల్లోని పరిమళాల మత్తులో సీతారామ్ మునిగిపోయాడు.

* * *

తెల్లవారాకా ఆ ఇంటి ముందు...

ఏమయింది ఏమయింది... ఎలా అయింది ఎలా అయింది... అయ్యో అయ్యో... చచ్చిపోయాడా? శివం చచ్చిపోయాడా... నిన్ననే చూశాను టీ దుకాణం దగ్గర... నిన్ననే నాతో మాట్లాడాడు... పుస్తకం చదువుకుంటూ ఉంటే సాయంత్రం వచ్చి — టీ చేసి ఇస్తే తాగి వెళ్లాను. అయ్యయ్యో... అయ్యయ్యో... కళ్లముందే... చిన్న వయసు వాడు... ముప్పయ్యేళ్లు కూడా ఉండదు... నిన్న ఆఫీస్‌కి వచ్చి తన పని తాను చూసుకున్నాడు.

వాళ్లతోపాటు సీతారామ్ కూడా వచ్చిచూసి ఆశ్చర్యపోయాడు. కన్నీళ్లు పెట్టుకున్నాడు. సీతారామ్ భార్య వచ్చి భోరున ఏడ్చేసింది. సీతారామ్ నిశ్చేష్టుడై

పోయాడు. రాత్రి వినిపించిన శివం మూలుగు లక్షమూలుగులై చెవుల్లో ధ్వనించసాగింది.

— చచ్చిపోయేవాడు కాదేమో...

శివం ఆఫీస్‌లోని తోటిఉద్యోగులు కన్నీళ్లుపెట్టుకున్న ముఖాలతో శోకగ్రస్థులై నుంచున్నారు. ముఖ్యంగా బి.డి.ఓ అంత్యక్రియల ఏర్పాట్లన్నీ స్వయంగా చూశాడు. మంచుపల్లకిని తన భుజాల మీద మోశాడు. సీతారామ్ శవవాహకుల్లో ఒకడైనాడు. అంత్యక్రియలకి ఊళ్లోజనం, పాఠశాల ఉపాధ్యాయులు, పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్, డాక్టరు అంతా వచ్చారు. సీతారామ్ చితాగ్ని పెట్టాడు. మంటలు బూడిదలో కలిసిపోయే వరకు వచ్చిన వాళ్లంతా ఉన్నారు. అక్కడే మధ్యాహ్నం రెండు గంటలయింది. ఎక్కడ పుట్టాడో చివరికి ఈ మట్టిలో ఇక్కడ కలిసిపోయాడు. అంతా ఋణానుబంధం అనుకున్నారు.

శివం మిత్రుడు రావు ఎలాగయితేనేం సాయంత్రానికి రాగలిగాడు. చివరిసారిగా శ్మశానంలో మిత్రుని భౌతికదేహం కలిసిపోయిన బూడిదని చూశాడు. మరొక్కసారి అక్కడ మంటలు ప్రజ్వలించి మండినట్టయింది. ఆ మంటల్లో శివం ముఖం ప్రశాంతంగా కన్పించింది. గుండె తరుక్కుపోయి రోదించాడు. శివం దగ్గరి బంధువు ఒకాయన పొరుగూళ్లో మిడిల్ స్కూల్ హెడ్మాష్టరుగా ఉంటున్నాడు. ఆయన కూడా సాయంత్రం కబురు తెలిసి సైకిలేసుకుని వచ్చాడు.

ఆ సాయంత్రం కూడా పదిహేనుమంది సంతాపకులు వచ్చి శివం గుణగణాలను చెప్పుకున్నారు. ఆఫీస్‌లో ఎవరి ఊసూ పట్టించుకునే వాడుకాదు. ఏదన్నా అర్థంకాకపోతే పైఆఫీసర్ దగ్గరకు వెళ్లి అడిగి తెలుసుకునేవాడు. ఆఫీస్ వేళకి కనీసం అర్ధగంటముందే వచ్చి సీట్లో పని చేసుకుంటూ కూర్చునేవాడు. ఎవ్వరితోనూ పేచీలు పెట్టుకునే వాడు కాదు. వాద వివాదాలకి దూరంగా ఉండేవాడు. ఎవరినీ చివరికి పడని వారిని సైతం తన నోటితో తిట్టి ఎరగడు. తోటి గుమాస్తాలు పై అధికారులనీ, సమితి పాలకులనీ తిట్టినప్పుడు సైతం కిమ్మనేవాడు కాదు. శివం లాంటివాళ్లు ప్రపంచంలో పనికిరారని శివం గురించి చెప్పుకున్న ఆ తోటి ఉద్యోగులే ఇప్పుడు ఈ హఠాన్మరణంతో తమతమ అభిప్రాయాలు మార్చుకున్నారు. మృత్యువు విలువలని ఎట్లా తారుమారుచేస్తుందో వాళ్ల ప్రవర్తన, సానుభూతి చూస్తే అర్థమవు తుంది. ఒక దుర్మార్గుడు చనిపోయినా ప్రపంచం అయ్యో పాపం అంటుందే తప్ప 'అబ్బ, వీడి పీడ వదిలింది' అనదు కదా.

ఆ రాత్రి అక్కడే భోజనాలు ఏర్పాటుచేశారు. అంతా బీ.డీ.ఓ గారి పర్యవేక్షణలో

సాగుతున్నది. ఆ ఖర్చులు కూడా అతడు తన పైసలతోనే చేశాడు. బ్రాహ్మణులని పిలిచి వాళ్లకు భోజనాలు, దానాలు ఏర్పాటు చేశాడు. తమ కళ్లముందే ఓ నిండుజీవితం అదృశ్యమైపోవటం వైరాగ్యాన్ని కలిగించింది. వాళ్లు తమని తాము చూసుకోసాగారు. తాము చివరకు మట్టిలో కలిసిపోయేవాళ్లే కదా. తమ ఆశలూ ఆనందాలూ ఇట్లాగే ముగుస్తాయి కదా. అంతా క్షణికమే కదా. సృష్టి అంతా ఒక అసత్యంగానూ, ఆ అసత్యాన్ని నమ్మించటానికి ఈ జీవితం ఎన్నెన్నో భ్రమలను సృష్టిస్తున్నట్టూ అన్పించసాగింది. శివం గంభీరమైన ఆ విశాలనేత్రాలు సమాజ శ్రేయస్సును చూస్తుండేవి. తన రచనల్లోని పాత్రల రూపురేఖలనీ, ఔన్నత్యాలనీ, ఆనందవిషాదాలనీ ప్రతిబింబించేవి.

ఆ రాత్రి రావు, పొరుగూరు హెడ్మాష్టరు వాళ్లను సీతారామ్ తను ఇంట్లో పండుకోమన్నప్పటికీ వాళ్లు ప్రక్కవాటా శివం గదిలోనే పండుకున్నారు.

పగలు వింతవింత ఆకర్షణలలో, నిరుపమానమైన అందాలతో కనిపించిన రంగులన్నిటిని చీకటి ఏకవర్ణం చేసింది. జ్ఞానానికి అవి సున్నితంగా, ఇంద్రియాతీతంగా అందేదేదో ఓ పరిమళంలాంటి అనుభూతి మాత్రం తమతమ జీవితాల మీద కొత్త విలువలతో ప్రశాంతి నిచ్చింది.

రెండోరోజు ఉదయం హెడ్మాష్టరు వెళ్లిపోయాడు.

సీతారామ్‌కి తన మీద అసహనంగా ఉంది. పొరుగున ఉన్న తోటి మనిషి బాధని తను పట్టించుకోలేకపోయాడు. మూలుగు విన్నప్పుడు తాను వెళ్లి ఏమయింది అని అడిగి తెలుసుకోలేకపోయాడు. శివం బతికేవాడేమో.

సీతారామ్‌కి తను పదేళ్లవాడుగా ఉండగా చెరువులో స్నానం చేస్తూ లోతుకు దిగి మునిగి పోతున్నప్పుడు, నీళ్లు తాగేస్తున్నప్పుడు ప్రక్కనే స్నానం చేస్తున్న తనకన్న రెండు మూడేళ్ల పెద్ద వయసు స్నేహితుడు, తనని కాపాడేడు. లేకపోతే ఆ రోజే గుటుక్కుమనేవాడు.

పోలీస్‌లకి సైతం అనుమానం రాలేదు. పైగా డాక్టరు శివంకి గుండె జబ్బు ఉన్నట్టు చెప్పాడు. శివంకి గుండెనొప్పి ఉన్నట్టు అందరికీ తెలిసిందే. అయినా అంతరాత్మ క్షమించటం లేదు. ఎవరో ఒక సానుభూతి పరుడు 'భగవంతుడు శివంకి ఇలాంటి రాత రాశాడు' అన్నాడు. సీతారామ్‌కి భగవంతుడు కరుణామయుడుగా కన్పించాడు.

రావు పగలంతా నిద్రపోయాడు. కలలో కన్పించి మిత్రుడు ఏమన్నా చెప్తాడేమోనని ఆశించాడు. కాని మొద్దు నిద్ర తప్పించి ఇంకేమీ లేదు. తెలిసిన వాళ్లు

ఒకరూ ఇద్దరూ వచ్చి చూసి వెళ్తున్నారు. తనకు సీతారామ్ భోజనం పెట్టున్నాడు.

రావుకి శివం రచనలు తీసి చూడాలనిపించింది. శివంతో ఎప్పుడు మాట్లాడినా సాహిత్యమే. కొత్తగా తాము చదువుకున్న పుస్తకాల గురించే. ఆ కథలూ, నవలలూ, సాహితీ వ్యాసాలూ, కవిత్వమూ — శివం గొప్ప రచయిత అయ్యేవాడని ఆశ పెట్టుకున్నాడు. సాహిత్యం కోసమే సాహిత్యమే జీవితంగా జీవించాడు శివం. అట్లా సాహిత్యానికే అంకితమైపోయే వాళ్లని తను చూడలేదు. తానూ రచయితే. అయినప్పటికీ తన రచనాధోరణి వేరు. రచన తనకు అభిమానం. సరదాకోసం తాను రచనలు చేస్తాడు. శివంకి ఉన్న అంకితభావం తనలో లేదు. జీవితాల్లో, సమాజంలో మరీ ఆకర్షించిన కథలు ఉంటే ఆ మూడ్ ఉంటే రాస్తాడు. మరి శివం అలా కాదు. జీవితాన్ని, సమాజాన్ని, మనుషుల్ని సన్నిహితంగా పరిశీలిస్తాడు. పాత్రలను నిజజీవితం నుండే తీసుకుంటాడు. సన్నివేశాలను మాత్రం కల్పించుకుంటాడు. కథా ప్రారంభము, గమనము, ముగింపు అన్నీ శిల్పపటిమతో రాణించాలని, తగిన భాషని ఎంచుకుంటాడు. కథని కనీసం రెండు మూడు సార్లన్నా రాస్తాడు. రాసినప్పుడు వాక్యాలు పదాలు సరిదిద్దుకుంటాడు. ఈ పద్ధతిలో రచన అప్రయత్నంగా సాగదు. చిత్రికలు పెట్టూనే ఉండాలి. మెరుగులు దిద్దుతూనే ఉండాలి. ఈ రచనాభ్యాసం ఇట్లా కొనసాగితే కొన్నాళ్లకి రచన అప్రయత్నంగా సహజ సరళంగా కళాత్మక ప్రతిభతో శోభిస్తుందో ఏమో!

శివం రాసుకున్న కాగితాలను సర్దుతుంటే అతడి రైటర్ నోట్ బుక్ దొరికింది. దాన్ని అతడు తెలుగులో 'కలం తోడు' అని పేరు పెట్టుకున్నాడు.

... భర్త ఆమెకి విడాకులిచ్చాడు. ఇంకో పెళ్లి చేసుకున్నాడు. అప్పటికే ఆమెకు నాలుగేళ్ల కొడుకున్నాడు. కొడుకును పెంచి పెద్ద చేసింది. పెళ్లి చేసింది. కాని భర్తను ఆ పెళ్లికి పిలవలేదు.

ఇదేమిటీ మానవ అనుబంధాలు? ఒకరికొకరు ఆరాధించుకుని సాగించిన ఐదారేళ్ల దాంపత్య జీవితం ఇంత శత్రుత్వాన్ని ఎలా కల్పించాయి. ఆమె పెళ్లి బలవంతంగా తల్లి దండ్రుల ఒత్తిడితో జరగలేదు. ఇష్టంతోనే జరిగింది మరి.

ఆమె చూట్టానికి నీరసంగా, బలహీనంగా, దిగులు కళ్లతో, శూన్యంలోకి చూసే చూపులతో కన్పిస్తుంది. ఆమెలో ఏదో ఆకర్షణ ఉంది. ఆమె కూడా ఎందుకు పెళ్లి చేసుకోరాదు? చూట్టానికి ఆమె రెండో భార్యకన్నా అందంగా ఉంటుంది. ప్రవర్తనలో హుందాతనం ఉంది. మాటల్లో ఆత్మీయత ఉంది.

సమాజం ఆమెకు ఎలాంటి పరిష్కారమార్గాన్ని చూపుతుంది? ఆమె జీవితానికి

ఏ దారి చూపుతుంది.

రచయిత ఈ సమస్యకు ఏ పరిష్కారం చూపాలి. సందేశం ఏమిటి?

తల్లి జీవితం మీద కుమారుడి అభిప్రాయాలు ఏమిటి?

ఆ కుమారుడే తల్లి కథ చెప్తున్నట్టు రాస్తే ఎలా ఉంటుంది?

రావుకు ఈ ఇతివృత్తం, కథా బీజం — ఆలోచనల్ని రేకెత్తించింది.

శివం రాసిన కథలన్నీ చదివాడు రావు. ఈ కథ ఇంకా రాసినట్టులేదు. కింద తేదీ రాసుకున్నాడు శివం. నాలుగేళ్ల క్రితం రాసుకున్నాడీ నోట్స్. ఈ కథ ఇంత కాలం ఎందుకు రాయలేకపోయాడో?

శివం ఏ కథ రాసినా ఆ శని ఆదివారాల్లో రావు దగ్గరకు వెళ్లి తన కొత్త కథ చదివి వినిపించి రావు అభిప్రాయం అడిగి తెలుసుకునేవాడు. ఎక్కడన్నా అసందర్భాలూ, అసహజాలూ, అనౌచిత్యాలు, అర్థఅస్పష్టత, అనవసర వివరణలు ఉంటే అడిగి తెలుసుకునేవాడు. సామాన్యంగా రావు కథ ఎత్తుగడ బాగా లేదనో, ముగింపు ఇంకా బలంగా విస్మయ వైచిత్రితో ఉండాలనో చెప్పడం తప్పించి పాత్రల స్వభావాలకు అనుగుణంగా సంభాషణలు దొర్లాయో లేదో, సన్ని వేశాల కల్పనలో పూర్వాపరాల ఔచిత్యం కుదిరిందో లేదో, కథాగమనం సరళంగా సాగిందో లేదో చెప్పలేక పోయేవాడు. తరచు కథ 'బావుంది' అని ఒక మాటలో కథను మెచ్చుకుని పత్రికకి పంపించండి అని గాని, ఫలానా పత్రికకు పంపించి చూడండి అని గాని సలహా ఇచ్చేవాడు. తర్వాత శివం తిరిగి తన ఊరు వచ్చేసి కథ సాఫు ప్రతిరాసి పత్రికకు పంపించడమూ, ఆరేడు వారాల తర్వాత ఆ కథ భద్రంగా తిరిగి రావడమూ, రావుకు రాసిన ఉత్తరంలో ఫలానా కథ భద్రంగా తిరిగి వచ్చిందని తెలియజేయడమూ జరుగుతుండేవి.

...అతడు గ్రామపెద్ద. గ్రామంలో వచ్చిన తగువులన్నీ అతడి దగ్గరే పరిష్కారమౌతాయి. ఆస్తి తగువులు, అప్పులువడ్డీల తగువులు, అత్తా కోడళ్ల తగువులు, తండ్రీ కొడుకుల మధ్య అన్న దమ్ముల మధ్య తగువులు, ఇంటి దొంగతనాల తగువులు, విని నొప్పించని విధంగా, ఊళ్లోవాళ్లు మెచ్చుకునే విధంగా తీర్పులు చెప్పేవాడు.

ఆ గ్రామ పెద్ద జీవితంలోనే పెద్ద సమస్య ఎదురయింది. భార్య పెళ్లయిన పదేళ్ల తర్వాత కొడుకుని కని — కన్న వారింట్లోనే ఉండిపోయింది. భర్తతో కాపురం చేయటానికి అత్తవారింటికి రాలేదు. ఎన్ని రాయబారాలు చేసినా ఫలించలేదు. భర్తకన్నా రెట్టింపు ఆస్తిపరురాలు ఆమె. ఒక్కతే కుమార్తె. తల్లి తండ్రులతో

ఉండిపోయింది.

'కథని భార్య దృక్కోణంతో రాయాలి' అని రాసుకున్నాడు శివం.

ఇట్లాంటి ఇతివృత్తాలు దాదాపు ఏభైకి పైగానే ఉన్నాయి.

ఒక వాక్యం రాసి, 'ఈ వాక్యంతో కథ ప్రారంభించాలి' అని వ్యాఖ్యానం చేసుకున్నాడు. అక్కడక్కడ మంచి మంచి సంభాషణలు, నుడికారాలు, సామెతలు రాసుకున్నాడు.

***

తర్వాత ఓ సంవత్సరానికి రావు పేరుతో ఓ కథల సంపుటి వెలువడింది. ఆ పుస్తకం మొదటి పుటలో —

"అంకితం

కొత్త చూపు ప్రసాదించిన నా దివంగత మిత్రుడు శివంకి" అని ఉంది.

***

– 'ప్రజాప్రభ' వారపత్రిక